

ఇద్దాసుకు నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గుప్తా, జనార్దన్‌మూర్తి తదితరులు

తొలి దళిత కవి ఇద్దాసు

చిక్కడపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహాయోగి, తొలి దళిత కవి దున్న ఇద్దాసు అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో భాగంగా త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఆదివారం తొలి దళిత కవి, తెలంగాణ వేమన దున్న ఇద్దాసు సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. సాహిత్యాన్ని, సంస్కృతిని, సామాజిక సమైక్యతని సుసంపన్నం చేసిన మహనీయులలో అగ్రగణ్యుడు ఇద్దాసు అని అన్నారు. ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి పరిశోధకులు ఇద్దాసును మాదిగ మహాయోగిగా కీర్తించారన్నారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటి చరిత్రకారులు, సాహిత్య చరిత్ర రచయితలు ఇద్దాసును తొలి దళిత కవిగా గుర్తించారని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, గాయకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాల మహానాడు రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రశాంత్

ఎమ్మార్పీఎస్ విష ప్రచారాన్ని మానుకోవాలి

కవాడిగూడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మాలలపై ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘాలు చేస్తున్న విష ప్రచారాన్ని మానుకోవాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రవీణ్ ప్రశాంత్ అన్నారు. ఆదివారం మాలమహానాడు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాలల కంటే మాదిగల జనాభా ఎక్కువ అంటూ అసత్య ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వాస్తవానికి మాలలకంటే మాదిగలే విద్య, ఉద్యోగ, వ్యాపార, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ముందున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వర్గీకరణకు మద్దతు ఇస్తూ మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి ఓట్ల రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎల్. రాజు, రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్. రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోటూరు ఉదయంకు నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు ఎస్. పుణ్యవతి, మల్లు లక్ష్మి తదితరులు

ధీశాలి మోటూరు ఉదయం

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల సాధనలో ఎన్ని అవాంతరాలు వచ్చినా మడమతిప్పని ధీశాలి మోటూరు ఉదయం అని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మోటూరు ఉదయం వర్ధంతి సందర్భంగా ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఐద్వా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. మోటూరు ఉదయం రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా హిట్లర్‌కు వ్యతిరేకంగా బుర్రకథ బృందాన్ని తయారు చేసి తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా ప్రచారం చేశారని గుర్తు చేశారు. మహిళలకు ఆస్తి హక్కు కోసం పోరాడి సాధించిన ఘనత మోటూరి ఉదయం, మల్లు స్వరాజ్యంది అని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.ఎన్.ఆశాలత, బి.అనురాధ, పి.సత్తమ్మ, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థల్లో

ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు వత్తాసు పలుకుతున్న ఇంటర్ బోర్డు అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఆదివారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో జరిగిన బీసీ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నగరంలో పేరొందిన విద్యా సంస్థలు 90 శాతానికిపైగా అడ్మిషన్లు పూర్తి చేశాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అడ్మిషన్లను రద్దు చేయకపోతే ఇంటర్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జిపై మందుబాబుల తిష్ఠ

- రాత్రి సమయంలో మద్యం తాగి బాటిళ్లు పడేస్తున్న వైనం

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నాయిని నర్సింహారెడ్డి స్మారక స్టీల్ బ్రిడ్జి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం రాంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎర్రం శేఖర్, గోక నవీన్, ముదిగండ మురళి, జ్ఞానేశ్వర్‌గౌడ్, శివ మాట్లాడారు. స్టీల్ బ్రిడ్జిపై రాత్రి సమయంలో ఆకతాయిలు బ్రిడ్జిపై మద్యం తాగి బాటిల్స్ అక్కడే పడేస్తున్నారని అన్నారు. బ్రిడ్జిపై వ్యర్థాలను జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించడం లేదన్నారు.

చర్చిల్లో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు

ముషీరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినం సందర్భంగా ముషీరాబాద్‌లో క్రైస్తవులు ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకే చర్చిలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చిలో పాస్టర్ శ్యామ్ అబ్రహాం బైబిల్‌లోని దైవ సందేశాన్ని అందించారు. ఏసుప్రభువు పాపుల విముక్తికోసం శిలువ వేయబడి మూడవ రోజు పునర్జన్మ పొందినందున ఈస్టర్ పండుగ జరుపుకుంటున్నాం అని అన్నారు. పండుగ సందర్భంగా చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సువార్త ర్యాలీ



సువార్త ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

చిక్కడపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ క్రాస్‌రోడ్డులోని హెబ్రోను చర్చిలో ప్రార్థనల అనంతరం సమీప వీధుల్లో సువార్త ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెబ్రోను సొసైటీ చైర్మన్ బ్రదర్ జోసెఫ్ పి. కురియన్, ప్రధానకార్యదర్శి ఆర్. వీరాచారి తదితరులు పాల్గొన్నారు. ఏసుక్రీస్తు బోధనలు శాంతియుత సమాజ స్థాపనకు దోహదపడతాయని, ఈస్టర్ పర్వదినం ప్రజల్లో శుభాలను నింపుతుందని పేర్కొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌పై మరోసారి కమలం జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కాచిగూడ డివిజన్ భూమన్నగల్లీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు బీజేపీకి మరొకసారి భారీ మెజారిటీ అందించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కావ్యా కిషన్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్, నాయకులు కృష్ణకుమార్, క్షీరసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ వివరించండి

కవాడిగూడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, ముషీరబాద్ కన్వీనర్ ఎం. రమేష్‌రాం సూచించారు. ఆదివారం కవాడిగూడ తాళ్ల బస్తీలో కార్పొరేటర్ నివాసంలో ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పి. పరశురాం, జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగు కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ బీజేపీ సికింద్రాబాద్ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలుపుకోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, కె. పరిమళ్‌కుమార్, డివిజన్ల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, సత్యేంద్రప్రసాద్, ధర్మేందర్, వాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె. లక్ష్మణ్

బీజేపీ గెలుపునకు సమష్టిగా కృషిచేయండి

చిక్కడపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ. డా.కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల కార్యాచరణ ప్రణాళిక సమీక్షలో భాగంగా గాంధీనగర్ డివిజన్ బూత్ సమన్వయకర్తల(కో-ఆర్డినేటర్లు) సమావేశం ఆదివారం పూసరాజు కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ లక్ష్మణ్ బూత్ కో-ఆర్డినేటర్లకు ఎన్నికల కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ. పావని, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్ పాల్గొన్నారు.

బీసీ బిల్లుపై బీజేపీ, కాంగ్రెస్ స్పష్టమైన ప్రకటన చేయాలి

- ఎంపీ ఆర్. కృష్ణయ్య



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, భరత్‌కుమార్ తదితరులు

బర్కత్‌పుర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లుపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు స్పష్టమైన ప్రకటన చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం ఎంపీ టికెట్లు ఇవ్వకపోతే ఆ పార్టీలను ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ సంయుక్తాధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. 16 డిమాండ్లను ప్రధాన రాజకీయ పార్టీల ముందుంచుతున్నామన్నారు.ఏ పార్టీ స్పందిస్తే ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకే మద్దతు తెలుపుతామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని, రాజ్యాంగ భద్రత కల్పించాలని, జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని, క్రీమీలేయర్‌ను రద్దు చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, సామాజిక భద్రత రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి 2 లక్షల కోట్లను కేటాయించాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, నందగోపాల్, సుధాకర్, వేముల రామకృష్ణ, జి.ఆనంతయ్య, పృధ్వీగౌడ్, రాందేవ్ మోదీ, నిఖిల్, వాణిరెడ్డి, ఉదయ్‌నేత, సతీష్, చంద్రశేఖర్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలో అద్భుత ప్రగతి

- చంద్రయాన్-3 కీలక శాస్త్రవేత్త జ్యోశ్యుల అచ్యుత కమలాకర్

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ అద్భుత ప్రగతి సాధించిందని చంద్రయాన్-3 కీలక శాస్త్రవేత్త, భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ పూర్వ సంచాలకులు జ్యోశ్యుల అచ్యుత కమలాకర్ పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో స్వదేశీ పరిజ్ఞానం వినియోగించుకొని విజయవంతమైన ప్రయోగాలెన్నో ఉన్నాయన్నారు. ముఖ్యంగా 1962 నుంచి రాకెట్ ప్రయోగాల్లోనూ, 1980 నుంచి శాటిలైట్ లాంచింగ్‌తో దేశం ఆధునిక విశ్వ విజ్ఞాన శాస్త్ర రంగంలోనూ దూసుకుపోతున్నట్లు వివరించారు. తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆన్‌లైన్ వేదికగా 'మన ప్రాచీన భారతీయ సాహిత్యం - ఆధునిక విశ్వ విజ్ఞాన శాస్త్ర వికాసానికి మూలం' అంశంపై సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి జ్యోశ్యుల అచ్యుత కమలాకర్ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ.. నేవిగేషన్, ఎర్త్ అబ్జర్వేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, టెలీకమ్యూనికేషన్, స్పేస్ సైన్సెస్, ప్లానెటరీ ఎక్స్‌ప్లోరేషన్, హ్యూమన్ స్పేస్ ఫ్లైట్, స్పేస్ సైన్సెస్ తదితర విభాగాల్లోనూ విప్లవాత్మక మార్పులకు, అద్వితీయమైన ప్రయోగాలకు నాంది పలికామని వివరించారు. స్పేస్‌లో వ్యర్థాలు పెరిగాయని, 30 మీటర్ల గ్రహ శకలం ఒకటి పడినా ఒక నగరం ధ్వంసమయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. అలాంటి ప్రమాదాలకు తావు లేకుండా మన అంతరిక్ష పరిశోధనా సంస్థ ముందస్తు నివారణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్వాహకుడు తోటకూర ప్రసాద్, రచయితలు నాగసూరి వేణుగోపాల్, ప్రతాప్ కౌటిల్య తదితరులు పాల్గొన్నారు.

కాలేరును కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులిజగన్, గరిగంటి రమేష్ తదితరులు

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి చేస్తున్న ప్రయత్నాన్ని మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కాలేరు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని డిమాండ్ చేశారు. అధిష్ఠానం ఆయనను పార్టీలోకి చేర్చుకోవాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు నివాసంలో మాజీ కార్పొరేటర్లు గరిగంటి రమేష్, దిడ్డి రాంబాబు, పులిజగన్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, యాసిన్ షరీఫ్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లి పార్టీకి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కాలేరు వెంకటేష్ అని వారన్నారు. అలాంటి వ్యక్తిని తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. బీసీ ఎమ్మెల్యే అయి ఉండి బీసీల ప్రతినిధి అయిన గౌతులచ్చన్న ఆడిటోరియం నిర్మాణానికి ఆయన ఎందుకు కృషి చేయలేదని వారు ప్రశ్నించారు. అధికారమే పరమావధిగా, ధనార్జనే లక్ష్యంగా పనిచేసే వ్యక్తి కాలేరు వెంకటేష్ అని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జె.సత్తిబాబు, రామ్మోహన్‌రావు, హరితిలక్‌సింగ్, పంజాల వెంకటేష్‌గౌడ్, తొలుపునూరి కృష్ణగౌడ్, జి.శ్రీధర్‌గౌడ్, రవికుమార్, ఫరీద్, ముంతాజ్, శ్యామ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వస్తే స్వాగతిస్తాం : టీపీసీసీ కార్యదర్శి

బర్కత్‌పుర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కాంగ్రెస్‌లోకి వస్తే స్వాగతిస్తామని టీపీసీసీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. ఆదివారం ఫతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ మునిగిపోతున్న నావ వంటిదని, ఆ పార్టీకి రాష్ట్రంలో మనుగడ లేదని, అందు కోసమే నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కాంగ్రెస్‌లోకి రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కాలేరు వెంకటేష్‌కు రాజకీయ జీవితం ఇచ్చిందన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, ధనార్జన్‌రెడ్డి, న్యాయవాది విశ్వం, మున్నూరుకాపు సంఘం నాయకుడు మధు, ఉద్యమకారుడు పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, విద్య, వైద్యం అందించాలని కోరారు. రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఉద్యమకారుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, నాయకులు కె. జనార్దన్, కరుణాకరెడ్డి, జెనిగె విష్ణు, కె.యాదగిరిరెడ్డి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కడియం'ను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదు

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మచ్చలేని, నిజాయితీగల రాజకీయ నాయకుడని, ఆయనను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని మాదిగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు గారె వెంకటేష్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయంలో జరిగిన మాదిగ పరిరక్షణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరి అవినీతి, భూకబ్జాలకు పాల్పడలేదని, నిబద్ధతతో ప్రజాసేవ చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు కడియంపై ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో సమితి నాయకులు పాల్గొన్నారు.

వాహనం కిరాయి డబ్బు అడిగినందుకే దాడి

- నిందితులపై చర్యలు తీసుకోవాలి : బాధితుడు అక్బర్

రాంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తనతోపాటు కుటుంబ సభ్యులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు మహ్మద్ అక్బర్ డిమాండ్ చేశారు. గత శుక్రవారం రాత్రి రాంనగర్ మేడిబావి బస్తీ ఫాతిమా మసీదు ప్రాంతంలో జరిగిన దాడికి సంబంధించిన విషయాలను ఆయన ఆదివారం విలేకరులకు వివరించారు. మహ్మద్ అక్తర్ క్యాటరింగ్ వ్యాపారం చేస్తున్నాడని, అతడికి తన టాటా ఏసీ వాహనం కిరాయికి నడిపిస్తున్నానని అక్బర్ తెలిపారు. కిరాయి డబ్బులు రూ. 50 వేలు ఇవ్వాలని, డబ్బులు ఇవ్వమని అక్తర్‌ను అడుగుతుండగా అతడి చెల్లెలు, అన్నయ్య కుమారులు దాదాపు 20 మంది తనతో పాటు కుటుంబ సభ్యులపై దాడి చేశారని అక్బర్ ఆరోపించాడు. హలీం కొనుగోలు విషయంలో గొడవ జరిగిందని కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

గోల్నాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ కమలానగర్‌లో ఫిషర్ ఉమెన్ సొసైటీ అధ్యక్షురాలు ఎం. స్వరూప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ సొసైటీ అధ్యక్షురాలు కొప్పపద్మ, ఉపాధ్యక్షులు బైరి వినోద్‌కుమార్, జి. అనిల్‌కుమార్, పి. రేఖ, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.



సాయికుమార్‌ను సన్మానిస్తున్న స్వరూప తదితరులు

హాస్టల్ ఫీజు డబుల్

(3వ పేజీ తరువాయి)

రూ. 1.60 లక్షలకు పెరిగింది. మెయిన్స్‌కు గతంలో రూ.35వేల నుంచి రూ.40 వేలు తీసుకోగా ప్రస్తుతం రూ.50వేల నుంచి రూ.60 వేలు వరకు వసూలు చేస్తున్నారు. అలాగే గ్రూప్-2 రెండు నెలల శిక్షణకు గతంలో రూ.30వేలు ఉండగా ఇప్పుడు రూ.35వేలు తీసుకుంటున్నారు. గతంలో టెట్ శిక్షణకు రూ.8 వేలు తీసుకోగా ప్రస్తుతం రూ.10వేలు తీసుకుంటున్నారు. టీఆర్‌టీ కోచింగ్ ఫీజు గతంలో రూ.12వేల నుంచి రూ.16వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ.15వేల నుంచి 20వేల వరకు వసూలు చేస్తున్నారు. గత ఫీజులన్నీ మెటీరియల్‌తో కలిపి నిర్ణయించినవి కాగా, ప్రస్తుతం కొందరు స్టడీ మెటీరియల్‌తో కలిపి వసూలు చేస్తుండగా, మరికొన్ని సెంటర్ల నిర్వాహకులు మెటీరియల్‌కు వేరుగా వసూలు చేస్తున్నారు.

అదే సమయంలో హాస్టళ్లలో నెలవారీ చార్జీలను అమాంతం రెట్టింపు చేశారు. దిల్‌సుఖ్‌నగర్, చిక్కడపల్లిలోని సాధారణ హాస్టళ్లలో గతంలో వసతితో పాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రివేళ భోజనానికి రూ.3,500 నుంచి రూ. 4,000 తీసుకున్నారు. ప్రస్తుతం ఆ ధర రూ.6 వేల నుంచి రూ.8వేలకు చేరింది.

ఒక్కో గదిని నలుగురి నుంచి ఐదుగురికి కేటాయిస్తున్నారు. అటాచ్డ్ బాత్‌రూమ్‌లుండీ ఇద్దరు లేదా ముగ్గురు ఉండే గదులకు ఒక్కొక్కరికి రూ.10వేలు లేదా ఆపైన.. ఏసీ ఉన్న గదులకైతే రూ.15వేల వరకు వసూలు చేస్తున్నారు.

నాసిరకం భోజనంతో ఇబ్బందులు

అశోక్‌నగర్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్‌లోని హాస్టళ్లలో కొంతమంది నిర్వాహకులు దొడ్డుబియ్యం, నాసిరకం కూరగాయలతో భోజనం అందిస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. రోజువారీగా గదులను శుభ్రం చేయించడం లేదని, నిర్వహణ బాగోలేదని మండిపడుతున్నారు. దీనివల్ల అనారోగ్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. ఇదేమిటని అడిగితే.. ఉంటే ఉండండి, లేకుంటే వెళ్లిపోండని కటువుగా చెబుతున్నారని అంటున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు హాస్టళ్లను తనిఖీ చేయాలని, అప్పుడే హాస్టళ్ల పరిస్థితి మెరుగవుతుందని అంటున్నారు.

సౌకర్యాలు సరిగా లేవు

దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ కోచింగ్ సెంటర్‌లో టీఆర్‌టీ కోచింగ్ తీసుకుంటున్నాను. రెండు వారాల క్రితం ఇక్కడికి వచ్చి హాస్టల్‌లో ఉంటున్నాను. నెలవారీ హాస్టల్ ఫీజు రూ.6వేలు. ఫీజుకు తగినట్లుగా హాస్టల్‌లో సౌకర్యాలు సరిగా లేవు. గతేడాది జూన్‌లో గ్రూప్-2 కోసం వచ్చి ఇక్కడే హాస్టల్‌లో ఉన్నాను. అప్పుడు హాస్టల్ ఫీజు రూ.4వేలు ఉండేది. ఆరునెలల్లో రూ. 2 వేలు అదనంగా పెంచారు. కోచింగ్ తప్పనిసరి కావడంతో వసతులు సరిగా లేకున్నా నిర్వాహకులు అడిగినంత చెల్లించాల్సి వస్తున్నది.

- అనిల్, జగిత్యాల

ఫీజులను నియంత్రించాలి

నగరంలోని ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులు దోచుకుంటున్నారు. పోటీ పరీక్షలను అడ్డు పెట్టుకుని అభ్యర్థుల నుంచి కొంతమంది ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. డబ్బులు ఎక్కువ తీసుకుంటున్నా వసతులపై, భోజనం నాణ్యతపై దృష్టి పెట్టడం లేదు. జీహెచ్ఎంసీ అధికారులు హాస్టళ్లను తనిఖీ చేయాలి. ఫీజులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.

- శ్యామ్, పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్షుడు

గ్రేటర్‌గా మారని సిటీ రేషన్

(3వ పేజీ తరువాయి)

కూడా ముందుకు జరగలేదు. నిజానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే శివారు రేషన్ వ్యవస్థ గ్రేటర్‌లో కలవాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లిప్త ధోరణి, శివారు డీలర్ల అడ్డంకులతో గ్రేటర్ సీఆర్‌ఓ ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితమయ్యాయి.

ఇబ్బందులను తప్పించుకోవడానికి

సీఆర్‌ఓ పరిధిని గ్రేటర్ వరకు విస్తరింపజేస్తే శివార్లలోని మూడు సర్కిళ్ల కలుస్తాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలోని సగం దుకాణాలు, ఆహార భద్రత కార్డులు సీఆర్‌ఓ పరిధిలోకి వచ్చి చేరతాయి. దీంతో ఆయా జిల్లాల పౌరసరఫరాల వ్యవస్థకు కొంత మేరకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. అందుకే ఈ విలీనానికి కొంతమంది అధికారులే ఆసక్తి చూపడం లేదని సమాచారం.

డీలర్లలో ఆందోళన

జిల్లాల పౌరసరఫరాల వ్యవస్థ జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో పనిచేస్తుంది. జిల్లా పరిధి అధికారుల పనితీరుకు అలవాటు పడిన కొందరు రేషన్ డీలర్లు, మిల్లర్లు 'గ్రేటర్ సీఆర్‌ఓ' ప్రతిపాదనలపై ఆసక్తి చూపడం లేదు. వారు ప్రస్తుతమున్న జిల్లాల అధికారుల పరిధిలోనే పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

గ్రేటర్ సీఆర్‌ఓలో శివారు సర్కిళ్ల కలిస్తే సీఆర్‌ఓ, డీఎస్‌ఓల పర్యవేక్షణ నిత్యం ఉంటుందని డీలర్లు భావిస్తున్నారు. కొత్తగా సీఆర్‌ఓ వ్యవస్థలో చేరితే నిరంతరం ఏదో ఒక ఇబ్బంది వస్తుందని, తనిఖీలు ఉంటాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో వారు పెద్దగా ఈ అంశంపై శ్రద్ధ చూపడం లేదు.

శ్రీరామధూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

బర్కత్‌పుర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఉచిత వైద్య సేవలందించి వారి జీవితాలలో వెలుగులు నింపడమే శ్రీరామధూత ట్రస్ట్ లక్ష్యమని నిర్వాహకులు సాయోజీరావు, బి.వి.రావు, బాలకృష్ణ, కాశేశ్వర్, హరీష్ తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. సుమారు రెండువేల మంది శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో 37 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.